క్లుప్తంగా

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బాగుచేసిన బోరు ద్వారా వస్తున్న నీటిని చూపిస్తున్న మెకానిక్‌లు

రాజాం సిటీ: పట్టణంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని మాదిగ వీధిలో పాడైన బోరును శనివారం బాగుచేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నామన్నారు.


పరామర్శ



మంగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని సిరిపురానికి చెందిన మాజీ సర్పంచ్ మంగరాజు పాపినాయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ శనివారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, సర్పంచ్ జోల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు



అర్ధరాత్రి వేళ ఎం.సీతారాంపురం వద్ద విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు శుక్రవారం అర్ధరాత్రి యుద్ధప్రాతిపదికన చేపట్టారు. భారీగా వీచిన ఈదురుగాలుల ధాటికి కొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై చెట్లకొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. అప్రమత్తమైన ఏఈ కోనూరు వినయ్‌కుమార్ వీరఘట్టం మండలంలోని నవగాం, వండవ, బిటివాడ ప్రాంతాల్లో 33 కేవీ విద్యుత్ లైన్, అనంతరం వంగర విద్యుత్ సబ్‌స్టేషన్, ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లు సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని తెలగవీధి సత్యనారాయణపురంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు బట్టరు శ్రీనివాసాచార్యులు శనివారం తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని, భక్తులంతా పాల్గొని, స్వామి ఆశీస్సులు పొందాలన్నారు. పనసలవలస వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాథం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపడతామన్నారు.

ఆపన్నహస్తం



వెంకటరమణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: అనారోగ్యంతో ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయి, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆపన్నహస్తం అందించింది. నగరానికి చెందిన పుల్లెల వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సమాఖ్య ప్రతినిధి టి.వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు రాంకుమార్, కోశాధికారి కూర్మెళ్ల సరోజ, రమేష్, మల్లీశ్వరి తదితరులు సంఘ సభ్యుల సహకారంతో వెంకటరమణ కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. సకాలంలో స్పందించిన బ్రాహ్మణ బంధువర్గం వారికి, దాతలకు సంఘం తరఫున అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

- నేను బడికి పోతా కార్యక్రమ మండల కమిటీ చైర్మన్ బి.మధుసూదనరావు



రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో ఆర్‌జేడీ చిన్మయిదేవి



తెర్లాం: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు తీసుకోవాలని ఆ కార్యక్రమ మండల స్థాయి కమిటీ చైర్మన్, ఎంపీడీవో బి.మధుసూదనరావు తెలిపారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో నేను బడికి పోతా కార్యక్రమంపై ప్రజలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని బడిఈడు పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుని ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని ఆర్‌జేడీ చిన్మయిదేవి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేయడం జరుగుతోందని, దీంతో పాటు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు కృషి చేయడం జరుగుతోందన్నారు. అనంతరం ఐదేళ్లు దాటిన 10 మంది పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించి, ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో బాడంగి ఐసీడీఎస్ పీవోలు ఎస్.కె.రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం



రాజాం: ఆగూరు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు అందజేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద వరి విత్తనాల పంపిణీ శనివారం ప్రారంభించినట్లు ఏవో ఎ.రేణుకాసాయి తెలిపారు. ఖరీఫ్ సాగు నిమిత్తం మండలానికి సంబంధించి 1121(శ్రీధృతి), సోనా, సాంబ మసూరి, స్వర్ణ, ఎంటీయూ 1224 తదితర రకాల విత్తనాలు వచ్చాయని, వీటిని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల ద్వారా రైతులకు అందజేస్తున్నామన్నారు. మండలంలోని 21 ఆర్‌బీకేల ద్వారా 2,450 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మండలంలో 3,200 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

రాయితీపై వరి విత్తనాలు..

తెర్లాం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూనాయవలస సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి బోడెల విజయబాబు కోరారు. స్థానిక ఆర్‌బీకేలో రైతులకు వరి విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులంతా ఈ విత్తనాలను తీసుకుని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేపట్టాలని సూచించారు. ఆర్‌బీకేల్లో లభించే నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని, ప్రైవేటు దుకాణాల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: కూనాయవలసలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయబాబు



వంగర: వీఏఏలకు సూచనలిస్తున్న ఏవో కన్నబాబు

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో తట్టికోట కన్నబాబు కోరారు. మండలంలోని మగ్గూరు రైతు భరోసా కేంద్రంలో వీఏఏలతో శనివారం సమావేశమైన ఆయన విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వివరాలతో పాటు అందుబాటులోని విత్తనాలను అడిగి తెలుసుకున్నారు. ఎంటీయూ-1064, 1121, 1318, 1224, 7029 రకాల వరి విత్తనాలతో పాటు యూరియా, డీఏపీ ఎరువులు రైతులకు అందివ్వాలని తెలిపారు.

బడిబయట పిల్లలను గుర్తించండి



తెర్లాం హైస్కూల్‌లో చేరిన విద్యార్థుల వివరాలపై ఆరాతీస్తున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: బడిబయట పిల్లలు(డ్రాపౌట్స్(చదువు మధ్యలో మానేసిన వారు), బడిఈడు వచ్చినా చదవని వారు)ను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాలని నేను బడికి పోతా కార్యక్రమ మండల స్థాయి కమిటీ చైర్మన్, ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ రాజ్యలక్ష్మితో కలిసి సందర్శించిన ఆయన.. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఇప్పటివరకు చేరారని, ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారని హెచ్‌ఎం రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది పాఠశాలలో చదువుతూ, ఈ ఏడాది పాఠశాలలో జాయినింగ్ అవ్వకుండా ఉండిపోయిన విద్యార్థులు ఎవరైనా ఉన్నారా అని కూడా అడిగారు. బడిబయట ఉన్న విద్యార్థులను వెంటనే పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు



మాట్లాడుతున్న ఏపీఎం భాగ్యలక్ష్మి

బాడంగి: పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలో మండల మహిళా కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. స్త్రీనిధి, బ్యాంకులు, ఉన్నతి ద్వారా సంఘాలు, సభ్యులు తీసుకున్న రుణాలను సత్వరమే చెల్లించేలా చూడాలన్నారు. గ్రామాల్లోని సంఘాలను గ్రేడ్-ఎలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలు భారతి, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని బూరాడ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిమ్మాలమ్మ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని అంబకండి, సోమరాజుపేట, తాటిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సందర్శించిన ఆమె.. అక్కడి కేంద్రాలు, రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. మాతాశిశు మరణాల రేటును తగ్గించేందుకు కృషి చేయాలని, గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలన్నారు.

భారీ వర్షం



రామభద్రపురంలో కురుస్తున్న వర్షం

రామభద్రపురం: మండల కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ వర్షం వ్యవసాయానికి కూడా అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270



పారంపేటలో ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో హరనాథ్ తెలిపారు. మండలంలోని వప్పంగి, పారంపేట, పనసలవలస, మునకలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లగా ఉందని, ఇటువంటి సమయంలోనైనా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. రైతులకు ఉపయోగపడేలా సాగునీటి కాలువల బాగుకు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు.

రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వక్త

బొబ్బిలి: స్థానిక సీపీఎం కార్యాలయంలో చెరువుల పరిరక్షణపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులన్నింటినీ అక్రమార్కులు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన స్థలాలు కూడా కొన్నిచోట్ల ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఇవే విషయాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న కోటి చెరువు, మిలటరీ కాలనీ వద్ద ఉన్న చేపల చెరువు, భైరిసాగరం, పక్షులబంద, జూట్ మిల్లు వద్ద ఉన్న రెండు బందలను ఆక్రమణదారులు ఆక్రమించారని పేర్కొన్నారు. ఈ ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు, ఆర్‌డీవోకు ఫిర్యాదులు చేశామని, అయినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించి, ఆక్రమణల గుట్టు తేలుస్తామన్నారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు పి.శంకరరావు, కోట అప్పన్న, రైతు సంఘం నాయకులు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు, ఎస్.గోపాలం, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించండి



వాసవీనగర్‌లో మురుగునీటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. స్థానిక పట్టణంలోని బాబానగర్, వాసవీనగర్, మారుతీనగర్, బుచ్చింపేట, సారథి వార్డుల్లో శనివారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. రోడ్లపై, కాలువల్లో అనవసరంగా చెత్త వేయొద్దన్నారు. ఇంటింటికీ చెత్తసేకరణ సిబ్బంది వచ్చినప్పుడు వారికి చెత్తను ఇవ్వాలని తెలిపారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ఎన్నికల్లో ఓడిపోయామని అధైర్యపడొద్దని, పార్టీపరంగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా సమీక్షలు నిర్వహించి, ధైర్యం చెబుతున్నారన్నారు. ప్రజాతీర్పును గౌరవించాలని, పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని దిశానిర్దేశం చేశారన్నారు. పార్టీకి చెందిన ఏ ఒక్క కార్యకర్తను నిర్లక్ష్యం చేయమని, అందరికీ అందుబాటులో ఉండి అండగా ఉంటామన్నారని తెలియజేశారన్నారు. ఈ మేరకు తాము కూడా మండలాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కూటమి నేతల బెదిరింపులకు భయపడొద్దని, ధైర్యంగా ప్రజల బాగు కోసం పనిచేయాలని సూచిస్తున్నామన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



వంగర: మడ్డువలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి, సంరక్షించాలని కోరారు. ప్రతీ చిన్నారి పుట్టినరోజున ఆ చిన్నారితో ఓ మొక్క నాటే సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

వంగర: మండలంలోని మడ్డువలస అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీ దుర్గ మాట్లాడుతూ సకల జీవరాశుల మనుగడకు మొక్కలు పెంపకం చాలా అవసరమన్నారు. మొక్కలు పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో కూడా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలింపు



బొబ్బిలి: స్టూడెంట్ కిట్లుతో విద్యార్థులు



తెర్లాం: పాఠశాలలకు వ్యాన్‌లో స్టూడెంట్ కిట్లు తరలిస్తున్న ఎంఈవో త్రినాధరావు



రామభద్రపురం: స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎంఈవో తిరుమల ప్రసాద్, హెచ్‌ఎం కామేశ్వరరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టూడెంట్ కిట్లను ప్రతీ విద్యార్థికి అందజేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు శనివారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఆలస్యం చేయకుండా స్టూడెంట్ కిట్లు విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పాపారావు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు శనివారం అందజేశారు. ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామారావు కోరారు.

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని ఎంఈవో తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.కామేశ్వరరావుతో కలిసి ఆయన విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని, అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నందిగాంలో రైతులకు నవధాన్యాలు పంపిణీ చేస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ఆనందరావు

తెర్లాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, అదే నేలలో పండించే పంటలు బాగా పండుతాయని ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ఆనందరావు, ఏవో జి.సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని నందిగాం, పూనువలస ఆర్‌బీకేల పరిధిలో నవధాన్యాల సాగుపై శనివారం రైతులకు అవగాహన కల్పించి, నవధాన్యాల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా పంటలకు పట్టే చీడపీడల బెడద తగ్గుతుందని, మంచి దిగుబడులు వస్తాయన్నారు. నవధాన్యాలు సాగుతో భూసారం పెరిగి పంటకు అవసరమైన పోషకాలు నేల నుంచే లభిస్తాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగం పెంచాలని రైతులను కోరారు. ప్రతిఒక్కరూ నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు.